విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకుని నియోజకవర్గాన్ని వైసీపీ హాయాంలో అభివృద్ధి పథంలో నడిపిన యువనాయకుడు దేవినేని అవినాష్‌ని గుర్తించి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు అప్పగించారు. దేవినేని అవినాష్ మరెన్నో పదవులను అలంకరించి బాధ్యతగా తన కర్తవ్యాన్ని దిగ్విజయంగా నిర్వర్తించి ప్రజా బంధువైన తన తండ్రి దివంగత దేవినేని నెహ్రూకి మంచి పేరు ప్రతిష్టలుగా మరింతంగా పెంపొందించాలని ఆశిస్తూ..

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడి దేవినేని అవినాష్‌కి

శుభాకాంక్షలు

వెన్న శివశంకర్

వైసీపీ 16వ డివిజన్ నాయకులు, విజయవాడ



18వ వసంతంలోకి...

నేటి దినపత్రిక

సూర్య

ఎన్టీఆర్ - కృష్ణా

గురువారం 26 సెప్టెంబర్ 2024 పేజీలు 8

# 15 రోజుల్లోనే పరిహారం అందించాం



- దేశంలో ఎక్కడాలేని విధంగా బాధితులకు అత్యధిక ఆర్థిక సాయం
- వరద బాధితులకు రూ.602కోట్ల పరిహారం పంపిణీ
- బాధితులకు మనోధైర్యం కల్పించాం
- అత్యంత పారదర్శకంగా నష్ట గణన
- సీఎంఆర్ ఎఫ్‌కు రికార్డు స్థాయిలో రూ.400 కోట్ల విరాళాలు
- దాతలందరికీ పాదాభివందనం చేస్తున్నా
- బాధితులకు సాయం అందించడంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాం
- శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించేది లేదు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**విజయవాడ బ్యూరో, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** బుడమేరు వరదలు, భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు దేశంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో కేవలం పక్షం రోజుల్లోనే నష్ట పరిహార సాయం అందించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వరదల వల్ల రాష్ట్రంలో మొత్తం రూ.7600 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. బుధవారం విజయడలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వరదబాధితులకు పరిహార పంపిణీ కార్యక్రమం జరిగింది. వరద నష్ట పరిహార పంపిణీ చేసిన సమాచార లేఖలను లబ్దిదారులకు లాంఛనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ బుడమేరు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుతో పాటు వరదల్లో నష్టపోయిన వారికి రూ.602 కోట్ల మేర నష్ట పరిహార సాయాన్ని బాధితుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని చెప్పారు. వదర బాధితులకు సాయం అందించడంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్థిక సాయం అందజేశామన్నారు. 2



జిల్లా అధికార యంత్రాంగం

## కృషి భేష్

కలెక్టర్ బాగా పనిచేశారంటూ ముఖ్యమంత్రి ప్రశంస

వివరాలు 2లో..



ఎదురుమొండి - గొల్లమంద రహదారి నిర్మాణానికి

## రూ.13.45 కోట్లు

- ఏ.ఐ.ఐ.బి. గ్రాంట్ ద్వారా నిర్మాణం
- కృష్ణా తీరంలో కోత నిరోధానికి 700 మీటర్ల మేర ఆర్.సి.సి. పర్కుపైన్స్ వినియోగం
- తక్షణమే పనులు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం

వివరాలు 2లో

అధికారుల సమన్వయ

## లోపమా... నిర్లక్ష్యమా..?



7

- కలెక్టర్ పర్యటనలో భద్రతా చర్యలు శూన్యం
- ఒక సాధారణ పడవలో కలెక్టర్ ప్రయాణం
- కలెక్టర్ ధైర్యసహసాలకు ఫిదా అయినా మండల ప్రజలు

# 15 రోజుల్లోనే పరిహారం అందించాం




(మొదటిపేజీ తరువాయి)

ఇంకా ఎవరైనా అర్హులుంటే ఈ నెల 30వ తేదీ నాటికి వాటినిక కూడా పరిష్కరించి సాయం అందిస్తామని చెప్పారు. చిట్ట చివరి బాధితుడికీ సాయం అందే వరకు విశ్రమించబోమని వరద సహాయక చర్యలు చేపట్టినప్పుడే హామీ ఇచ్చానని ఆ మేరకు అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా ఎంపిక చేసి ఆ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించి, బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. **సీఎం ఇంకా ఏమన్నారంటే...**

వరదల నష్ట పరిహారాన్ని బాధితుల ఖాతాల్లో నేరుగా జమ చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు కలుపుకొని మొత్తం రూ. 7,600 కోట్ల మేర నష్టం వచ్చింది. నేనెప్పుడూ చూడనటువంటి విపత్తు ఇది. ఒక ప్రాంతంలో 42 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బుడమేరు ప్రాంతంలో ఎప్పుడూ సంతగా ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చింది. గత ప్రభుత్వం చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయి. గతంలో బుడమేరు ఆధునికీకరణకు రూ. 57 కోట్లు ఇస్తే గత ప్రభుత్వం నిర్లక్ష్యం, రాజకీయ వివక్షతో ఆ పనులను రద్దు చేసింది. 11.90 లక్షల క్యూసెక్కుల సామర్థ్యమున్న ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో ఒక్కసారిగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు గత పాలకుల నిర్లక్ష్యాలు రెండు కలిసి ప్రజలకు శాపాలుగా మారే పరిస్థితి వచ్చింది.

**బాధితులకు మనోధైర్యమిచ్చాం**

సింగునగర్‌లోని పరిస్థితిని చూసి కలెక్టరేట్‌లోనే మకాం వేసి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాం. అప్పటి పరిస్థితిని చూస్తే చాలా బాధేస్తుంది. సీఎస్ మొదలు సీనియర్ ఐఏఎస్ అధికారులను వార్డుల్లో పెట్టి ప్రత్యక్షంగా సహాయక చర్యలను పర్యవేక్షించాం. వరద సహాయక చర్యల కోసం ఒక్కో జిల్లాకు రూ.3 కోట్లు తక్షణ సాయం కింద నిధులిచ్చి ఆర్డర్ల కోసం నిరీక్షించకుండా ఖర్చుపెట్టమని ఆదేశాలిచ్చాం. కేంద్రంలో ఉన్న ప్రముఖులతో మాట్లాడి రాత్రికి రాత్రి ఆరు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను, 100 పవర్ బోట్లు, హెలికాప్టర్లు తెప్పించాం. 120 బోట్లు, 150 డ్రోన్లు కూడా ఉపయోగించాం. గండ్లు పూడ్చడంతో పాటు నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను కూడా తొలగించాం. ప్రమాదకర ప్రాంతాలకు అయితే నేను నాలుగైదుసార్లు వెళ్లాను. ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ తెప్పించుకొని అవసరమైన సహాయసహకారాలు అందించాం. బాధితులకు మనోధైర్యం కల్పించాం. డ్రోన్లు, ఫైర్ ఇంజిన్లు ఉపయోగించడం వంటి వినూత్న కార్యక్రమాలతో సహాయమందించాం. సహాయకచర్యల్లో వేలాది మంది పనిచేశారు. కోటి 14 లక్షల నీటి బాటిళ్లు, 37 లక్షల లీటర్ల పాలు, 47 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 5 లక్షల గుడ్లు పంపిణీ చేశాం. కోటి 15 లక్షల ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశాం. 5000 క్వింటాళ్ల కూరగాయలను 2,45,000 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశాం. ఫైర్ ఇంజిన్లను ఉపయోగించి దాదాపు 75 వేల ఇళ్లను, 330 కిలోమీటర్ల మేర రహదారులను, వీధుల్లోని బురదను శుభ్రం చేశాం. దాదాపు 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తరలించాం. భవిష్యత్తులో ఇలాంటి వరదలు ఏవైనా ఎదురైనప్పుడు ఈ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విపత్తు నిర్వహణ కొత్త ఆవిష్కరణకు దారితీసింది.

**రికార్డు స్థాయిలో రూ. 400 కోట్ల విరాళాలు**

గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 400 కోట్ల విరాళాలు వచ్చాయి. దాతలు చూపిన చొరవ, వారు మానవతా దృక్పథంతో ముందుకొచ్చిన తీరు స్ఫూర్తిదాయకం. వీల్‌ఛైర్‌లో సైతం వచ్చి విరాళాలు అందించారు. విపత్తు వచ్చినప్పుడు సాటివారికి సాయం చేయాలనే వారి తపన ఎంతో స్ఫూర్తినిచ్చింది. చిన్నపిల్లలు సైతం తాము దాచుకున్న సొమ్మును ఇచ్చారు. దాతలందరికీ పాదాభివందనం చేస్తున్నా. రూ. 7,600 కోట్ల మేర నష్టం వస్తే ఈరోజు ప్రభుత్వ సాయం కింద రూ. 602 కోట్లు విడుదల చేశాం. ఈ రూ. 602 కోట్లలో రూ. 400 కోట్లు దాతలే ఇచ్చారు. ఇది చరిత్రాత్మకం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా హుదుద్, తిత్లీ కంటే మెరుగైన ప్యాకేజీ ఇచ్చాం. 16 జిల్లాలపై భారీ వర్షాలు, వరద ముంపు ప్రభావం పడగా ఒకేసారి ఈ రోజు బాధితులకు ఆర్థిక సాయాన్ని అందించాం. రాష్ట్రంలో 905 గ్రామాలు, 227 మండలాలు, 16 జిల్లాలపై వరదల ప్రభావం పడింది, వరదల్లో నష్టపోయిన నాలుగు లక్షల మందికి పరిహారం అందించాం. రాష్ట్రం మొత్తంమీద 74 మంది మరణించారు. విజయవాడలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో గ్రౌండ్ ఫ్లోర్లో నీళ్లు వచ్చిన వారికి రూ. 25 వేలు, ఒకటి, ఆపై అంతస్తుల్లో ఉన్నవారికి రూ. 10 వేల చొప్పున అందించాం. ఈ పరిహారం అందించడంలో చిన్నాపెద్దా అనే తేడా చూడలేదు.

**ఎవరూ ఊహించని స్థాయిలో సేవలందించాం**

గతంలో ఎన్నడూ కూడా పట్టణ ప్రాంతాల్లో విపత్తు ప్రభావిత బాధితులకు ఈ స్థాయిలో ఆర్థిక సహాయం అందలేదు. తూతూ మంత్రంగానే ఇచ్చేవారు. కానీ.. ఇప్పుడు నిబంధనావళిని మించి మరీ సాయం అందించాం. వరద ప్రభావిత ప్రాంత ప్రజలను ప్రభుత్వం పరంగా ఎన్ని విధాలా ఆదుకోవాలో అన్ని విధాలా ఆదుకుంటోంది. వినూత్న ప్రయోగాలతో సాయమందించాం. డ్రోన్లను ఉపయోగించి.. వరద నీటినిగానీ, ముంపు పరిస్థితినిగానీ అంచనా వేసి అవసరమైన సహాయసహకారాలు అందించగలిగాం. జిల్లా కలెక్టర్ సమర్థవంతంగా పనిచేయడంతో పాటు జిల్లా అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించారు. అర్బన్ కంపెనీ సహాయంతో మొత్తం 500 మందితో వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ తదితర సేవలు అందించారు. ఇప్పటికే దాదాపు 5,900 విజ్ఞప్తులను పరిష్కరించాం. విడిభాగాలపై 50 శాతం, లేబర్ ఛార్జీలపై 100 శాతం రాయితీతో ఎలక్ట్రానిక్ గూడ్స్‌ను రిపేర్ చేయించాం. ఇలాంటి 5,068 విజ్ఞప్తులను పూర్తిచేశాం. ఇంకా 700 వరకు ఉన్నాయి. ఒకవేళ రిపేర్ చేయకపోతే జాప్యం జరిగితే వాటిని మీరు తీసుకొని.. కొత్తవి ఇవ్వమని కంపెనీల వారికి చెప్పాం. 14 వేల గ్యాస్ స్టవ్‌లను రిపేర్ చేయించాం. బీమా, బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాం. క్లెయింల సెటిల్‌మెంట్ ప్రక్రియను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తిచేయమని చెప్పాం. రుణాల రీషెడ్యూలింగ్‌తో పాటు రూ. 25 వేలు నుంచి రూ. 50 వేల వరకు వినియోగ రుణాలు అందించాలని చెప్పాం. డ్రైవింగ్ లైసెన్సు, ఆర్‌సీలు, ఆధార్ కార్డులు, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు.. ఇలా ఏవిపోయినా వెంటనే ఉచితంగా ఇవ్వాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లలకు ఎవరికైతే పాఠ్య పుస్తకాలు పోయాయో వారందరికీ ఉచితంగా పుస్తకాలివ్వమని చెప్పాం.

**13 వేల అర్జీలనూ పరిష్కరిస్తాం**

ఆర్థిక సాయానికి సంబంధించి గత రెండు రోజుల్లో 17 వేల అర్జీలు వచ్చాయి. వీటిలో 4 వేలు డూప్లికేషన్స్ పోగా 13 వేల వరకు దరఖాస్తులు ఉన్నాయి. వీటిని కూడా రెండురోజుల పాటు నిశితంగా పరిశీలిస్తాం. అర్హులైన వారికి తప్పనిసరిగా సాయమందిస్తాం. రానివారికి ఎందుకు రాలేదో చెప్తాం. సచివాలయాల్లో జాబితాలు కూడా ప్రదర్శిస్తాం. సహాయ కార్యక్రమాలను ఈ నెల 30నాటికి పూర్తిచేసి ఆరోజు సాయంత్రం థ్యాంక్స్ గివింగ్ కార్యక్రమం నిర్వహిస్తాం. వరద బాధితులకు సహాయం అందించే యజ్ఞాన్ని విజయవంతంగా పూర్తిచేశాం. బటన్ నొక్కి ఫూల్స్ చేయడం లేదు. చేసేపని పవిత్రంగా చేయాలి. లబ్ధిదారులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సాయమందిస్తోంది. జీరో కరెప్షన్, జీరో మ్యానిప్యులేషన్‌తో సహాయమందిస్తున్నాం. నాపై నమ్మకంతో దాతలెందరో ముందుకొచ్చారు. ఇలాంటి పరిస్థితిలో వ్యవస్థలో ఎవరైనా ఒక్క రూపాయి తీసుకున్నారని తెలిస్తే వదిలిపెట్టను. గవర్నమెంట్‌లో ఉన్నవారైనా, ప్రైవేటులో ఉన్నవారైనా సరే జాతిద్రోహానికి పాల్పడే పనులు చేయొద్దు. ఒకవేళ చేస్తే మాత్రం ఎవరినీ వదిలిపెట్టను. కౌలు రైతులకు, వాస్తవ సాగుదారులకు సాయాన్ని అందించాం. ఇళ్లలో అద్దెల్లో నివసిస్తున్న వారు కూడా వరదల్లో నష్టపోయి ఉంటే వారికి కూడా సాయమందించాం. సవాల్ చేసి చెబుతున్నాం.. దేశంలో ఎక్కడా లేని విధంగా నష్టపోయిన రైతులకు సాయమందించాం. విధ్వంసాలు చేయడం.. వాటిని వేరేవారిపై నెట్టడం కొందరికి అలవాటుగా మారింది. ప్రజల ప్రాణాలు కాపాడటం, శాంతిభద్రతలు కాపాడటం వంటివి మా బాధ్యత. వీటికి ఎవరు విఘాతం సృష్టించినా, తప్పులు చేసినా సహించం.

## జిల్లా అధికార యంత్రాంగం కృషి భేష్

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వపరంగా సేవలందించడంలోనూ.. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నష్టగణన నిర్వహించడంలోనూ కలెక్టర్ సృజన అధికార యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించారంటూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి బుధవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకింగ్, బీమా సంస్థల ప్రతినిధులతో పాటు ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగమైన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలు క్షేత్రస్థాయి యంత్రాంగం వరకు సహాయక చర్యల్లో ఏ విధంగా భాగమయ్యారనే విషయాన్ని సీఎం వివరించారు. సంఘటిత శక్తి వరద విపత్తు నిర్వహణలో కీలకమైన సందర్భాన్ని వివరిస్తూ కలెక్టర్ సృజన పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. బాగా పనిచేశారని.. జిల్లా అధికార యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించారంటూ కితాబిచ్చారు. వరద నీటిలో లక్షలమంది చిక్కుకున్నారని, అన్ని రకాల నీళ్లు కలిసిపోయాయని, డ్రైయిన్లు పొంగి, మురుగునీరు కలిసిపోయి కనీసం మంచినీరు తాగే పరిస్థితి కూడా లేదని, కనీవిని ఎరుగని విపత్తును ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారని చెప్పారు. అంతా సర్వశక్తులు ఒడ్డి సహాయక చర్యల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విజయవాడ, కృష్ణా జిల్లా ప్రాంతం లో 200 ఏళ్లలో ఎప్పుడూ లేనంత వర్షపాతం, రికార్డు స్థాయిలో ప్రకాశం బ్యారేజీకి వరద, బుడమేరు గండ్ల నుంచి పోటెత్తిన వరదతో విజయవాడలో సగానికి సగం ప్రాంత ప్రజలు ముంపు ప్రభావానికి గురయ్యారు. ముఖ్యమంత్రి కలెక్టర్ కార్యాలయాన్ని క్యాంపు కార్యాలయంగా మార్చుకొని నిరంతరం సహాయకచర్యలను పర్యవేక్షించారు. అంతకుముందే క్షేత్రస్థాయి అధికారులను సహాయక శిబిరాల ఏర్పాటు, ప్రజల తరలింపు తదితర అంశాలపై వరుస టెలీ కాన్ఫరెన్స్‌ల ద్వారా అప్రమత్తం చేస్తూ వచ్చిన కలెక్టర్.. ఆగస్టు 31వ తేదీ నుంచి సహాయకచర్యల్లో మరింత తలమునకలయ్యారు. బాధితులకు ఆహారం, పాలు, నీళ్లు.. వంటివి అందించడంలో బృందాలను సమన్వయం చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక అధికారులు, సీనియర్ ఐఏఎస్ అధికారులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తూ ముందుకెళ్లారు. కంట్రోల్ రూం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆహార సరఫరా, పునరావాస శిబిరాలు.. ఇలా వివిధ రకాల టీమ్‌లనూ సమన్వయం చేయడంలోనూ కలెక్టర్ తనదైన పాత్ర పోషించారు. వరద బాధితులను సాధారణ స్థితికి తీసుకురావడంలో కీలక భాగస్వాములయ్యారు. బాధితులకు రేషన్ అందించడం, నష్ట గణన చేయడం, బ్యాంకింగ్, బీమా సేవలు అందించడం, అర్బన్ క్లాప్ సేవలు సరైన విధంగా అందేలా చూడటం.. ఇలా ప్రతి విషయంలోనూ కలెక్టర్ కృషి ప్రశంసనీయం.

## ఎదురుమొండి - గొల్లమంద రహదారి నిర్మాణానికి రూ.13.45 కోట్లు



**కోడూరు, మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా నాగాయలంక మండలంలో ఎదురుమొండి – గొల్లమంద రోడ్డు ఇటీవలి భారీ వరదలతో ఛిద్రమైంది. ఈ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.13.45 కోట్లు వ్యయంతో అంచనాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ముందు ఉంచారు. ఈ రోడ్డు పరిస్థితిపై కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, పంచాయతీరాజ్ ఈ.ఎన్.సి. బాలు నాయక్ వివరించారు. ఎదురుమొండి నుంచి గొల్లమంద వయా బ్రహ్మయ్యగారి మూల రోడ్డు కృష్ణా నది వెంబడి ఉంటుందని, నది సముద్రంలో కలిసే ప్రాంతానికి దగ్గరలో ఉన్న రోడ్డు కావడంతో తుపాన్లు, వరదల సమయంలో బ్యాక్ వాటర్స్ రోడ్డును బలంగా తాకుతుంటాయని తెలిపారు. ఫలితంగా రోడ్డు దెబ్బ తింటోందని, ఇటీవలి భారీ వరదలకు 700 మీటర్ల మేర కోతకు గురైందన్నారు.

**8 వేల ఎకరాలు కాపాడవచ్చు**

ఈ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళికలు చేసి, రూ.4 కోట్లతో అంచనాతో మంజూరై పనులు ప్రారంభ దశలో ఉన్నాయని... అయితే భారీ వరదల మూలంగా ధ్వంసం కావడంతో రోడ్డు మొత్తం తిరిగి నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కోతకు గురైన ప్రాంతంలో 700 మీటర్ల మేర తిరిగి ఆ పరిస్థితి రాకుండా తీరం వెంబడి ఆర్.సి.సి. పర్కుపైన్స్ వేస్తామని ఆ తరవాత రోడ్డు నిర్మిస్తామని వివరించారు. ఈ విధంగా రోడ్డు నిర్మిస్తే భవిష్యత్తులో ఆ ప్రాంతంలో కోతకు గురై, గండి పడకుండా చేయవచ్చని... తద్వారా 8 వేల ఎకరాలను, 12 వేల జనాభాను కాపాడవచ్చని తెలిపారు. ఈ రోడ్డు పునర్నిర్మాణాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. సవరించిన అంచనాలతో కూడిన నివేదికను సత్వరమే పంపించాలని, వ్యయాన్ని ఏ.ఐ.ఐ.బి. గ్రాంట్ నుంచి తీసుకోవాలని ఈ.ఎన్.సి.కి దిశానిర్దేశం చేశారు.

**పంట్ల పరిస్థితిపై నివేదిక పంపండి**

ఏటిమోగ నుంచి ఎదురుమొండి, అక్కడి దీవిలోని ఇతర పల్లెలకు ప్రజల రాకపోకల సౌకర్యం కోసం మెరుగైన పంట్లు అందించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా సాయం పొందే విషయమై జిల్లా కలెక్టర్ తో సమన్వయం చేసుకోవాలని తన కార్యాలయ అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పంట్లు సామర్థ్యం, తీసుకొంటున్న భద్రత చర్యలు, వాటి అమలుపై నివేదిక ఇవ్వాలని కృష్ణా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఏటిమోగ నుంచి ఎదురుమొండి వరకు వంతెన నిర్మాణం అత్యవసర ఆవశ్యకతను రోడ్లు, భవనాల శాఖకు తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి నిర్ణయించారు.

# వందరోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

## సూర్యదేవర నాగేశ్వరరావు వర్ధంతి సభలో వక్తలు



**నందిగామ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** లడ్డు పేరుతో ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దని స్వార్ధ రాజకీయాల కోసం తెలుగుదేశం వైసీపీ పార్టీలు ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని 100 రోజుల పాలనలో రాష్ట్ర ప్రజలకు ఏమోరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. భారత కమ్యునిస్టు పార్టీ సిపిఐ సీనియర్ నాయకులు ఆదర్శ కమ్యునిస్టు సూర్యదేవర నాగేశ్వరరావు తొమ్మిదవ వర్ధంతి సభ నందిగామ రైతు పేటలోనీ చంద్ర రాజేశ్వరరావు భవన్ లో జరిగింది. నందిగామ పాత బస్టాండ్ సెంటర్ చౌదరి హోటల్ నుంచి మెయిన్ బజార్, గాంధీ సెంటర్, విజయ టాకీస్, సీఎం రోడ్డు మీదుగా రైతు పేట సూర్యదేవర నాగేశ్వరరావు విగ్రహం వరకు కార్యకర్తలు ఎర్రజెండాలు చేత బూని ప్రదర్శన నిర్వహించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ సీనియర్ నాయకులు వల్లం కొండ బ్రహ్మం అధ్యక్షతన జరిగినటువంటి సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ వందరోజుల పాలనలో రాష్ట్ర ప్రజలకు ఏమి లబ్ధి చేకూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు ఏమి చేశారని రేపటినుండి ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం చేపట్టారు ముఖ్యమంత్రి మంత్రులు సమాధానం చెప్పాలని ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలు ఒక్కటి కూడా ఆచరణలోకి రాలేదని రాజకీయాల కోసం స్వార్ధ ప్రయోజనాల కోసం కోట్లాదిమంది ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ తిరుపతి లడ్డు చుట్టూ రాజకీయాన్ని తిప్పుతూ శునకానందం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని నష్టపోయిన ప్రతి కుటుంబానికి 50వేల రూపాయలతో పాటుగా ప్రతి ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లింపులు చేయాలని అన్నారు. సూర్యదేవర నాగేశ్వరరావు స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని స్థానిక సమస్యలను గుర్తించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ ఫ్లోర్ లీడర్ శాఖమూరి స్వర్ణలత మాట్లాడుతూ నేడు యువత చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతు న్నారని పక్క దారి పడుతున్నారని యువతను సన్మార్గంలో నడిపించాల్సిన టువంటి బాధ్యత కమ్యూనిస్టుల మీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, సిపిఐ సీనియర్ నాయకులు వీరులపాడు ఎంపీటీసీ ఎం ప్రకాష్ రావు, సిపి ఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి, సూర్యదేవర కవిత, ఏపిడబ్ల్యుజే నాయకులు చావా రవి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకల దేవిడ్, నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు, సీనియర్ నాయకులు మన్నెం నారాయణరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంక గోవింద రాజులు సిపిఐ మండల కార్యదర్శి మన్నే హనుమంతరావు, గులాం హుస్సేన్, వాసిరెడ్డి రాధాకృష్ణమూర్తి, పొల్నిడి నాగభూషణం, లతోపాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు రాష్ట్ర నాయకులు నజీర్ విప్లవ గీతాలు ఆలపించారు.

## ఆక్వా కల్చర్‌లో బయో సెక్యూరిటీ తప్పనిసరి



**కృత్తివెన్ను సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** ఆక్వా కల్చర్‌లో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత శుభ్రత ప్రాముఖ్య మైనదని ఎంపెడ రిటైర్డ్ డిడి బ్రహ్మేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం పడతడిక గ్రామంలో షెడ్యూల్ కులాల కార్మికులకు అవగాహన సదస్సును పాలపర్తి జాన్ రత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా సాగు లో షెడ్యూల్ కులాల వారికి ప్రభుత్వాలు అందించే రాయితీలు, సాగు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అవగాహన కలిగి ఆక్వా సాగు చేపట్టాలని అవగాహన లేకుండా ఆక్వా సాగు చేపడితే నష్టాలు చవి చూడవలసి వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని అప్పుడే మన చేసే పనిలో నైపుణ్యం సంపాదించగలమన్నారు. తీర ప్రాంతం కావడంతో ఆక్వా సాగు ఎక్కువగా సాగు చేయడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు ఆక్వా సాగులో మెల కువలు తెలుసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. రైతులకు అవగాహనతో పాటు వారికి కావలసిన కొన్ని పరికరాలు, కిట్స్ ను అందించినట్లు జాన్ రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో కె అయ్యప్పన్ జే టి ఓ ఎంపెడ, ఏ సాగర్ బాబు ఎఫ్ టి ఓ ఎంపెడ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

## సినిమా థియేటర్లను పరిశీలించిన రెవెన్యూ సిబ్బంది



**నందిగామ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్:** రేపు శుక్రవారం 27వ తేదీన విడుదల కానున్న జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సినిమా షోలు వెయ్యాలనిటికెట్లు అమ్మాలని, నిబంధనలు విరుద్ధంగా సినిమా టికెట్లు అమ్మితే చర్యలు తప్పవని తాసిల్దార్ నూతక్కి సురేష్ బాబు సినిమా థియేటర్ల యాజమాన్యానికి తెలిపారు. తాసిల్దార్ ఆదేశాలతో ఆర్ ఐ వేణికుమారి, వీఆర్వోలతో కలిసి నందిగామ లో దేవర సినిమా ఆడె థియేటర్లను పరిశీలించారు. టికెట్ 1000 రూపాయలకు అమ్ముతున్నరని సమాచారం మేరకు నిబంధనకు ఉల్లగించిన వారికి కఠిన చర్యలు తీసుకుంటామని రెవిన్యూ ముందు తెలిపారు.

## ఎమ్మెల్యే సౌమ్యని కలిసిన పీఆర్ డీఈ సరస్వతి



**నందిగామ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** పట్టణంలోని పట్టణం కాకాని నగర్ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య కార్యాలయం లో బుధవారం పి ఆర్ పిఐసి సబ్ డివిజన్ డి ఈకె సరస్వతి శాసన సభ్యులు తంగిరాల సౌమ్యని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించి, అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు.

## ఆరోగ్య సూత్రాలను పాటించండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆరోగ్య సూత్రాలను పాటించి తల్లి బిడ్డ ఆరోగ్యం వంతంగా ఉండాలని మొవ్వ ఐసిడిఎస్ అధికారులు తెలిపారు లక్ష్మీపురం సచి వాలయం రెండులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంతో పాటు గర్భిణీ స్త్రీల శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు ఐసిడిఎస్ సూపర్వైజర్ విశ్రాంతమ్మ, ఆదిలక్ష్మి ఐసిడిఎస్ అధికారులు కిషోర్ శిరీష ఆదిశేషమ్మ సునీత అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు అం గన్వాడి కార్యకర్తలు పోషకాహారంతో తయారు చేసిన వంటకాల ప్రదర్శనను అధికారులు పరిశీలించారు. అనంతరం అంగన్వాడీల పరిధిలోని గర్భిణీ స్త్రీల శ్రీమంత కార్యక్రమాన్ని నిర్వహించగా వారు ఆ కార్యక్రమంలో పాల్గొని గర్భిణీ స్త్రీలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు కిషోర్ బాలికలు అంగన్వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రధానంగా పప్పు ధాన్యాలు చిరుధాన్యాలు తీసుకోవా లని అలాగే ఆకుకూరలను అధికంగా తీసుకోవడం ద్వారా వారు ఆరోగ్యవం తంగా ఉంటారన్నారు. పప్పుధాన్యాలు చిరుధాన్యాలలో ఆకుకూరలలో పౌష్టిక విలువలు అధికంగా ఉంటాయని, అందువలన ప్రతి ఒక్కరు వాటిని తప్పని సరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 48 మెగా పిక్సెల్ సోనీ ఏఐ కెమెరాతో టెక్నో పాప్ 9 5జి విడుదల




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు ఇంటెలిజెంట్ టెక్నాలజీ ప్రొవైడర్ అయిన టెక్నో, సరికొత్త పాప్ 9తో విని యోగదారులను 'పాప్ టు 5జి'కి ఆహ్వానిస్తూ సెగ్మెంట్‌ను కదిలించడా నికి సిద్ధంగా ఉంది. టెక్నో నుండి వచ్చిన పాప్ సిరీస్ తమ స్వంత నిబం ధనలతో జీవితాన్ని గడిపే వారికి శక్తిని అందిస్తుంది. ఇది స్వేచ్ఛకు సంకే తం, పూర్తి స్థాయి వ్యక్తిత్వానికి ప్రతీక, అపరిమిత వినోదం అందిస్తుంది. వినియోగదారులకు సంబంధించిన స్పెసిఫికేషన్‌లతో వ్యూహాత్మకంగా ఎం ట్రీ లెవెల్‌లో ఉంచబడింది. ఈ స్మార్ట్ ఫోన్.. అందరికీ 5జి, అద్భుతమైన 48 మెగా పిక్సెల్ ఏఐ కెమెరా, స్మూత్ 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, ఆల్-డైరెక్ష నల్ ఎన్ఎఫ్సిలను అందిస్తుంది.

## మెక్‌డోవెల్స్ అండ్ కో నుంచి ఎక్స్ సిరీస్ ప్రీమియం వోడ్కా, రమ్, జిన్




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ బ్రాండ్‌లలో ఒకటైన మెక్‌డోవెల్స్ అండ్ కో, తన ఎక్స్ సిరీస్ వినియోగదా రులు ఇప్పుడు అత్యుత్తమ మద్యం శ్రేణిని ఆస్వాదిస్తున్న విధానాన్ని మళ్లీ అందుబా టులోకి తీసుకువచ్చింది. వోడ్కా, జిన్ నుంచి శక్తివంతమైన కొత్త సిట్రాన్ రమ్, రుచికరమైన డార్క్ రమ్ వరకు వీటిలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అన్యదేశ రుచులతో అత్యుత్తమ భారతీయ పదార్థాలను మిళితం చేస్తూ, మెక్‌డోవెల్స్ అండ్ కో రూపొందించిన ఎక్స్ సిరీస్ విభిన్నమైన కొత్త పోర్ట్‌ఫోలియోను అందజేస్తుంది. ఈ నూతన ఉత్పత్తులు అత్యుత్తమ, ప్రత్యేకమైన రెసిపీలు, శక్తివంతమైన కొత్త ప్యాకేజింగ్‌తో అసమానమైన రుచి అనుభవాన్ని అందించే ఉద్దేశాన్ని కలిగి ఉంది.

## నరహరశెట్టి మృతదేహానికి నివాళులు



**కోడూరు, మేజర్ న్యూస్ :** కోడూరు తూర్పు వైపునకు చెందిన నరహరశెట్టి వెంకటేశ్వరరావు మృతి చెందటంతో కోడూరు మండలం వైసీపీ నాయకులు జెడ్పీటీసీ సభ్యులు యాధవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటిసి సభ్యులు బడే గంగాధరరావు, వైసీపీ నాయకులు వెన్నాప్రసాద్, శివకుమార్ తదితరులు, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

## త్వరలో యాదవ కళ్యాణ మండప నిర్మాణ పనులు ప్రారంభం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ విలేకరుల సమావే శంలో మచిలీపట్నం యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ వి ఆర్ రాజు యాదవ్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన యాదవ కళ్యాణ మండపం నిర్మాణ పనులు పలు కారణాల చేత వాయిదా పడ్డాయి అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి కోటి 25 లక్షల నిధులు మంజూరు చేశారు. మొదటి విడతగా రూ. 50 లక్షలు నిధుల ను రిలీజ్ చేసి టెండర్ కూడా ఆమోదించారని అన్నారు. త్వరలో ఆంధ్ర ప్రదేశ్ మంత్రి కొల్లు రవీంద్ర,కొలుసు పార్థసారథి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి చే ప్రారంభించబడుతుందని, యాదవ సోదరులందరికీ వ్యక్తిగతంగా ఆహ్వానాలు పంపుతామని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండప నిర్మాణ కమిటీ అధ్య క్షులు గొల్ల బాబురావు, ఉపాధ్యక్షులు కేకే చంద్రయ్య, పులిచెర్ల సత్యనారా యణ, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, జొన్నలగడ్డ సోమేశ్వరరావు,గొరిపర్తి హరికృష్ణ, బొర్రా శ్రీనివాసరావు, జొన్నగడ్డ భీమారాజు, తోకల ప్రసాద్, బోయిన చింతయ్య తదితరులు పాల్గొన్నారు.




## రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మచిలీపట్నం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. రాజమండ్రి గౌతమి నేత్రలయం ఆప్టొమెట్రిస్ట్ రాజు 20మందికి కంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలిచ్చారు. ఐదుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి రాజమండ్రిలో శస్త్ర చికిత్స నిర్వహిస్తా మన్నారు. ప్రతి నెల రెండవ, నాల్గవ బుధవారాలలో నేత్ర పరీక్షలు జరుగుతాయని జిల్లా అధ్యక్షులు కారుమూరి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శంకర రావు, బికె దుర్గారావు, సత్యనారాయణ, సయ్యద్ పీర్, గౌతమి నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ ఎస్.గోపి పాల్గొన్నారు.

## పేదపట్నం, కానూరు పంచాయితీలలో ఇది మంచి ప్రభుత్వం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మండలం పెదపట్నం, కానూరు పంచాయతీలల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కుంచె నాని, క్లస్టర్ ఇంచార్జి లంకే శేషగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులులోపే అన్ని వర్గాల వారికీ లబ్ది చేకూరెలా పెన్షన్ల పెంచడం, మెగా డీఎస్సీ అన్నా క్యాంటీన్ పునప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఉచిత ఇసుక, వైన్ షాపుల్లో గీత కార్మికులకు రిజర్వేషన్ లాంటి పథకాలు పెట్టి ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు పేదవారికి, అట్టడుగు వర్గాల వారికీ అందించే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందాన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తలారి సోమశేఖర్, మీనవల్లి నాగేశ్వరావు, గడిదేశీ రవి, చెబోయిన సత్యనారాయణ, పీత రాము, సుబ్బారెడ్డి, కొనకళ్ళ నాగరాజు, సిరివెళ్ళ సాంబయ్య,దాసి విజయ్, దివి మహేష్, బోలిశెట్టి నాని, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, సచివాలయల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటగా మార్చేందుకు పొలం పిలుస్తుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వ్యవసాయాన్ని లాభసాటాగా మార్చేందుకు వ్యవసాయ విస్తీరణ కార్యక్రమం 'పొలం పిలుస్తుంది'ని బుధవారం పెదపట్నం గ్రామంలో నిర్వహించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం వివరిస్తూ ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ప్రజా ప్రతినిధులు, పంటల సాగుపై చర్చలు రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై ఆవగాహన కల్పించడం, క్షేత్ర సమస్యలకు తక్షణ పరిష్కారం సూచించడం, తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి ఎక్కువ నికరాదాయం దిశగా ప్రోత్సాహించడం, డ్రోన్లపై ఆవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో హారిక, కృష్ణా జిల్లా రైతు అధ్యక్షులు. మాజీ మార్కెట్ యాడ్ చెర్మెన్ గోపు సత్యన్నారాయణ మండల పార్టీ అధ్యక్షుడు కుంచె నాని.తలారి సోమశేఖర్, మీనవల్లి నాగేశ్వర గావు, దాసి విజయ్ కుమార్, లంకె శేషగిరిరావు, గడదేశి రవి, కాకర కాంతారావు, ప్రకృతి వ్యవసాయ స్వామి, కొనకళ్ళ నాగరాజు పాల్గొన్నారు.

# లడ్డు తయారీలో తప్పు చేసిన ఎంతటి వారినైనా సరే కఠినంగా శిక్షించాలి




### బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు, ఏ ఆర్ కె మూర్తి డిమాండ్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పరాసుపేటలోని బ్రాహ్మణ సేవాసంఘం కార్యాలయంలో బుధవారం బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు, ఏ ఆర్ కె మూర్తి, బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది, వింజమూరి శివరాం, బ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి, మోపర్తి సుబ్రమణ్యం, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, కందుకూరి సత్యనారాయణ శర్మ, పి. వి. ఫణి కుమార్, వడ్లమన్నాటి మారుతి దివాకర్, కాళీపట్నం రఘు శర్మ, జి ఎస్ ఎస్ ఆర్ శర్మలు నిర్వహించిన మాట్లాడుతూ.కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతి దాయకమైన లడ్డు ను హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా గత వైసిపి పాలకులు అపవిత్రంగా చూడడం చాలా దుర్మార్గం అన్నారు.దేశంలోనే కాకుండా ప్రపంచం నలుమూలల ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదమును అపవిత్రం చేసిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు.

గత పాలకులు కాసులకు కక్కుర్తి పడి హిందువుల ఆరాధ్యదైవం అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదమును హేళనగా చూడడం ఎంతవరకు సమంజసము అని ప్రశ్నించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత వైసిపి ప్రభుత్వం లోని పాలకులు చేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదమును అపవిత్రం చేసినందుకు యావత్తు హిందువులోకం కన్నెర్ర చేసిందని మండిపడ్డారు. ఆ దేవదేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామి తో పెట్టుకున్న వారు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారని గుర్తు చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులు ఎంతగానో ఇష్టపడే లడ్డు ప్రసాదం గత పాలకులు అపవిత్రం డబ్బుకి ఆశపడి చేశారా లేక హిందూ సంప్రదాయాన్ని దెబ్బతీయాలని చేశారా అనేది తెలియాల్సి ఉంది అన్నారు. తిరుమల లడ్డు తయారీలో తప్పు చేసిన ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలోనే కాకుండా ప్రపంచం నలుమూలల ఉన్న హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ లు అయిన వై వి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి,, మాజీ ఈవో ధర్మారెడ్డి లపై సిబిఐ విచారణ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం.భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా బిజెపి ఆఫీస్‌లో వారి చిత్రపటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి అసెంబ్లీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు గుత్తి కొండ రాజబాబు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము మాట్లాడుతూ భారత దేశ సమగ్రతకు పేద ప్రజలకు కేంద్ర సంక్షేమ పథకాలు అందాలని భారత దేశం ప్రపంచ మనకు ఆదర్శంగా ఉండేలా పనిచేయాలని నైతిక విలువలతో కూడిన రాజకీయం అవసరమని, బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకై అందరం సమిష్టిగా పని చేయాలని పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ అన్నారని ఈనాడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆ దిశగా పనిచేస్తున్నారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ రాము, తోట రంగనాథ్ శ్రీరామ చంద్రమూర్తి వైవిఆర్ పాండురంగా రావు, చలమలచెట్టు రామకృష్ణ వేములపల్లి వెంకటరమణ సూరిశెట్టి హరికృష్ణ వెంకటేశ్వరరావు, గాయత్రి, పద్మావతి విన్నకోట సుబ్బారావు పాల్గొన్నారు.

# కోతకు గురైన పంట భూములను ప్రభుత్వమే బాగు చేసి రైతులను ఆదుకోవాలి



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలకు మండలంలోని పాలేరు పరివాహక ప్రాంతంలో గల గ్రామాలలో కోతకు గురైన పంట భూములను ప్రభుత్వమే బాగు చేసి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు చేనుమోలు సైదులు, కోటా కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, రెడ్యానాయక్ తండ, బూదవాడ గ్రామాలలో కోతకు గురైన పంట భూములను రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం కోతకు గురై నష్టపోయిన రైతులతో పంట భూములను బాగు చేయించాలని కోరుతూ తహసిల్దార్ కు వినతి పత్రాలు పెట్టించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలేరు పొంగి ప్రవహించడం వలన ఆయా గ్రామాల్లో రైతులు, కౌలు రైతులు సాగు చేసుకుంటున్న సాగుభూమి కోతకు గురై తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ వరద నీటిలో పైప్ లైన్ లు, మోటార్లు సుమారు 500 వరకు వరద నీటిలో కొట్టుకొని పోయి నష్టపోయారన్నారు. అన్నవరం గ్రామంలో ఒక ట్రాక్టర్, కోళ్ల ఫారం కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారు అన్నారు. ప్రభుత్వం వరద నష్టాన్ని అంచనా వేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో పంట నష్ట పరిహారాన్ని రైతుల బ్యాంకు ఎకౌంట్లో వేస్తామని ప్రకటించింది తప్ప కోతక గురైన పంట భూములను నష్టపరిహారాన్ని అంచనా వేసి వారిని ఆదుకుంటాం అని ప్రభుత్వం కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ప్రకటించకపోవడం చాలా దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెండు, మూడు రోజులలో కోతకు గురైన భూములను అంచనా వేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని లేనియెడల పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో కలిసి ఈనెల 30వ తేదీన ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శులు దంతాల వెంకటేశ్వర్లు, కోటా కృష్ణ, నాయకులు భాస్కర్, పాపయ్య, రైతులు గుగులోతు శ్రీను, పవన్, భూక్య బిక్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షన్‌లో అగ్రస్థానంలో నిలుపుదాం

## నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో బుధవారం సాయంత్రం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలపై మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ రూప మిశ్రా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులతో పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో స్వచ్ఛతాహి సేవ లో భాగంగా నగర పాలక సంస్థలు చేయవలసిన కార్యక్రమాలు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, స్వచ్ఛ సర్వేక్షన్ లో విజయవాడ నగరపాలక సంస్థ అగ్రస్థానంలో ఉండాలని అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గుర్తించిన క్లీన్లినెస్ టార్గెట్ యూనిట్స్ (సీటీయూఎస్ అనగా తరచుగా పరిశుభ్రం చేయవలసిన ప్రదేశాలు) త్వరితగతిన పరిశుభ్రపరచాలని, క్లీన్లినెస్ టార్గెట్ యూనిట్స్ ని మూడు విధాలుగా విభజించి, లో, మీడియం, హైగ గుర్తించి దానికి అనుగుణంగా ఒక టార్గెట్ ని ఫిక్స్ చేసుకొని అనుకున్న కాల పరిమితిలో వాటిని పరిశుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు ఆదేశాలిచ్చారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా సెల్ఫీ పాయింట్స్ ని పెట్టి ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు, స్వభావం స్వచ్ఛత, సంస్కారం స్వచ్ఛత తో సెల్ఫీ పాయింట్స్ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నవలళి, స్వచ్ఛ సర్వేక్షన్ టీం పాల్గొన్నారు.



## దేవాలయాలు సందర్శనకై అవనిగడ్డ డిపో నుంచి ప్రత్యేక బస్సు

**కోడూరు, మేజర్ న్యూస్ :** ప్రయాణికుల ఆదరణతో ఏపీఎస్ ఆర్టీసీ అవనిగడ్డ డిపో నుండి ప్రతినెలా ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలం నకు మరి 9 ప్రముఖ దేవాలయాలు సందర్శించినట్లుగా స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సు నడపబడుతున్నదని అవనిగడ్డ డిపో మేనేజర్ కె.హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం రూ.3వేల ఛార్జీతో కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అర్ధవీడు అరుణాచలం, విష్ణు కంచి, శివకంచి, కామాక్షమ్మ గుడి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మొదలైన పుణ్యక్షేత్రాలు సందర్శించుకుని, దైవదర్శనం చేసుకుని వచ్చే విధంగా నాలుగు రోజులు యాత్రతో విజయవంతంగా నడపబడుతున్న అరుణాచలం స్పెషల్ బస్సు వచ్చేనెల పౌర్ణమికి ది.15.10.2024న సాయంత్రం 05.00గంటలకు బయలుదేరి రేపల్లె,బాపట్ల, చీరాల మీదగా వెళ్ళునని తెలిపారు. కావున ప్రయాణికులు ముందు సీట్లు కావలసినవారు వెంటనే ఈ బస్సు నకు సీటు రిజర్వేషన్ చేయించుకోవలసినదిగా తెలియజేస్తున్నామన్నారు. ఫోన్ నెంబరు 7036335 079, 9959225466ను సంప్రదించవలసిందిగా కోరుచున్నాను.

## నిత్యాన్నదానం పథకంనకు విరాళం



**కోడూరు, మేజర్ న్యూస్ :** మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానం పథకంనకు ఖమ్మం వాస్తవ్యులు ఎన్నాకుల వెంకట రాఘవేంద్ర మణికంఠ వెండి గిన్నె -1, వెండి ఉద్ధరిణి -1, వెండి మారేడు దళం దండ -1, 210 గ్రాములు బరువు కలిగిన ( సుమారు 20,000 రూపాయలు ) వెండి వస్తువులను డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావుకి అందజేశారు. తదుపరి దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



## ఘనంగా పడవల మోహన త్రినాథ్ జన్మదిన వేడుకలు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జనరల్ సెక్రెటరీ బత్తిన హరి రామ్, ముద్దినేని కొండ, కనపర్తి వెంకన్న, బొమ్మిరెడ్డి భగవాన్, సమ్మెట చిన్ని, సమ్మెట గణపతి, యార్లగడ్డ దుర్గా ప్రసాద్, ఒగ్గు సాయి, గల్లా హరీష్, శీరం సంతోష్, తోట సాయి తేజ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోగుల ప్రాణాలు కాపాడటంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకం



**పామర్రు సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** ప్రజల ప్రాణాలు కాపాడటంలో వైద్యుల తర్వాత ఔషధ నిపుణుల (ఫార్మసిస్టులు) పాత్ర ఎంతో కీలకమని పామర్రు శాసన సభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల కేంద్రమైన పామర్రు లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ వైద్యుల వెనుక ఉండి రోగులకు అవసరమైన మందులను అందించడంలో ఔషధ నిపుణులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. అటువంటి ఔషధ నిపుణుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో మన తెలుగువారు తయారుచేసిన ఔషధం ఎంతో మేలు చేసిందని, దీని వెనుక ఉన్న ఔషధ నిపుణులు అభినందనీయులని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో 20 సంవత్సరాల క్రితమే హైదరాబాదు, విశాఖపట్నంలలో ప్రత్యేకంగా ఔషధ కారిడార్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన ముందుచూపు కారణంగానే కోవిడ్ సమయంలో అత్యంత వేగంగా మందులను తయారు చేసి ప్రజల ప్రాణాలను కాపాడగలిగామని అన్నారు. కోవిడ్ కు మందులు తయారు చేయడంలో తెలుగువారి కృషిని ఎవరూ మరువలేమని వారిని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఔషధ నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లుక్కా నరేష్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాజేష్, పామర్రు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలిమ లతోపాటు పలువురు ఫార్మసిస్టులు, వైద్యులు, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** పట్టణంలో జి.వి.జె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో ఎన్టీఆర్ జిల్లా గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగ్గయ్యపేట మండలం, నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు, ఎంపికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రావు తో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి గేమ్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, నేటి పోటీ ప్రపంచంలో క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుడ్యానికి, మంచి ఆరోగ్యానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడలు కేవలం గెలుపు కోసమే కాకుండా, కలిసి కట్టుగా ఐకమత్యంగా పని చేయాలనే స్పూర్తి నింపుతాయని ప్రతీ విద్యార్థి క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రీడల్లో పాల్గొనే ప్రతీ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఎన్డీయే ప్రభుత్వం యువతీ యువకులు క్రీడల్లో రాణించేంచుకు అన్నీ విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కంచేటి గీతారాణి, పేరం సైదేశ్వర రావు, పూసల పుల్లారావు, నాయకులు మెడక కోటేశ్వరరావు, పితాని శ్రీనాథ్, స్కూల్ అధ్యాపక బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం





**పామర్రు సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గం పరిధిలోని పెదపారుపూడి మండలం వెంటప్రగడ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుతో పాటు గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. అధికారం చేపట్టిన నెలలోనే పింఛన్లు పెంచి ఇచ్చామని,ఉద్యోగ ప్రక్రియలో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ఇళ్లకు, పంటలకు నష్టపరిహారం అందించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు రక్షణ కవచాలుగా బూట్లు, గ్లౌజులు, యాప్రాన్లు అందించడంతోపాటు వారిని శాలువాలతో సత్కరించారు. అంతేకాక వారికి బియ్యం, నిత్యవసర సరుకులను కూడా అందించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా ప్రజలను ఆరోగ్యం నుండి కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సీతా మహాలక్ష్మి, తాసిల్దార్ వై రంగారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి), గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కూచిపూడి సుబ్బారావు, మసిముక్కు రాంబాబు లతోపాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.



## సంక్షేమం అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

### టీడీపీ మండల అధ్యక్షులు వీరంకి వీరస్వామి

**నందిగామ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని,నందిగామ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం నందిగామ మండలం అడవి రావులపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో నాయకులు, అధికారులతో కలిసి టిడిపి మండల అధ్యక్షులు వీరాస్వామిన్ పాల్గొన్నారు. ఇంటింటికి 100 రోజుల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రలను ప్రజలకు అందించారు.ఈ సందర్భంగా వీరంకివీరా స్వామిన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని, గత 5 ఏళ్లలో కనిపించని మార్పు ఈ వంద రోజుల్లో కనిపిస్తోందన్నారరూ.గతంలో ఉన్న 3 వేల పింఛనును వృద్ధులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. ప్రతి నెలా 1వ తేదీనే పింఛను అందిస్తూ వారిని ఆదుకుంటున్నారని వీరాస్వామిన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమీ నాయకులు, అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి 'బొర్రా' సేవలు మరువలేం

### ఏపీసీసీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివి ఏపీసీసీ మాజీ చీఫ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఇటీవల కొండపల్లిలో మరణించిన బొర్రా వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద బుధవారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు అనుచరుడిగా పేరు తెచ్చుకున్న బొర్రా వెంకటేశ్వరరావు తుది శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారన్నారు. కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా, వైస్ ఎంపీపీగా, ఇన్ చార్జి ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, ధనేకుల మురళీ మోహన్, మొవ్వా మోహన రావు, శ్రీనివాస రావు, పోతురాజు ఏసుదాసు, అక్కల నాగేంద్ర ప్రసాద్, పోతురాజు థామస్ పాల్, చెరుకు ఆనందరావు, ఉదయ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్.జగన్‌ను కలిసిన మొండితోక సోదరులు



**నందిగామ, సెప్టెంబర్ 24, మేజర్ న్యూస్:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎన్.టి.ఆర్. జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వైయస్ జగన్‌తో నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు.



### జగన్‌ను కలిసిన సింహాద్రి రమేష్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు కలిశారు.

# పండిత్‌కు నివాళులర్పించిన బీజేపీ నాయకులు



**నందిగామ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** దేశ దిశా నిర్దేశం చేసేందుకు అట్టడుగు వర్గాల ప్రజల చివరి మనిషి వరకు ఆకలితో అలమటించకుండా ఉంచడమే ఏకాత్మత మానవతా వాదమని సిద్ధాంతాన్ని చెప్పి దాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి జన సంఘం స్థాపించి రాజకీయంగా పాలకులు తీసుకునే నిర్ణయాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉండి వాళ్ళ అభివృద్ధి చెందాలా ఉండాలని తెలిపిన వారే సెప్టెంబర్ 25 1916 లో పుట్టి ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పనిచేస్తూ జన సంఘ నేతగా ఎదిగిన పండిత్ దీన్దయాల్ ఉపాధ్యాయ సమాజానికి మార్గదర్శకుడు అని నందిగామ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలురు బిజెపి నాయకులు నివాళులర్పించారు. నేటి రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చినప్పుడు ఈ తరహా సిద్ధాంతాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు మంచి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ,అసెంబ్లీ కో కన్వీనర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు సభ్యత్వ ప్రముఖ మునగంటి కామేశ్వరరావు,చందర్లపాడు మండల అధ్యక్షులు గుత్తా బాలకృష్ణ ఓబీసీ మోర్చా లక్ష్మణ్ మురుమూరి నరసింహారావు,బుర్రా వెంకట్రావు కొండ,ఎస్ఆర్ఎంటి ప్రసాద్ దేవత వెంకటేశ్వర్లు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో తాతయ్య



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** 6 రోజు జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం గ్రామములో రామ్ రాజగోపాల్ (తాతయ్య), శాసన సభ్యులు ప్రారంభించారు. 100 రోజుల ప్రజా వేధిక కార్యక్రమంలో శాసన సభ్యులు శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ అరాచక పాలన నుండి ప్రజలు బయట పడి ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నారని ప్రతి ఒక్క పెన్షన్ దారుడు సంతోషంగా పెరి గిన పెన్షన్ నగదు తీసుకొంటున్నాడని తెలియజేశారు. గౌరవరం గ్రామంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఇళ్లకు "ఇది మంచి ప్రభుత్వం" లోగో తో కూడిన స్టిక్కర్ ను, కరపత్రికను శాసన సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. రమేష్ బాబు, తహసీల్దార్ జగ్గయ్యపేట ఎన్. నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావు, గౌరవరం గ్రామ సర్పంచ్ ఎం. పావని, పంచాయతీ కార్యదర్శి బి.జగ్గయ్య, గౌరవర గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వచ్ఛత - హి - సేవ



**కోడూరు, మేజర్ న్యూస్ :** మోపిదేవి మండలం, మోపిదేవి గ్రామంలో వేంచేస్తున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు స్వచ్ఛత – హి – సేవ కార్యక్రమం లో భాగంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు దేవాలయంలో నిర్వహించబడుచున్నవి అందులో భాగంగా ఈరోజు ది. 25-9-2024 అనగా బుధవారము శ్రీ స్వామి వారి కళ్యాణ మండపంలో కేశఖండనశాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమం చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆదేశాలను అనుసరించి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ్రమ భవన నిర్మాణానికి సిమెంటు బస్తాలు వితరణ



**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** స్థానిక నిమ్మల తోటలోని సీయోను వృద్ధాశ్రమం ఆవరణలో నూతన ఆశ్రమ భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన ఘంటా రామకృష్ణ – సత్యవాణి దంపతులు 100 సిమెంటు బస్తాలు వితరణగా అందచేశారు. స్థానిక ప్రముకులు దోనేపూడి రవిశంకర్ ద్వారా ఈ సహాయాన్ని ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు. ఆశ్రమ నిర్మాణానికి చేయూత అందించిన దాతలకు భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## చల్లపల్లిలో కళాజాత కార్యక్రమం




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలపై కళాజాత కార్యక్రమం చల్లపల్లిలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. కళాభారతి కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాకారులు స్వచ్ఛత, పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పీవీ.మాధవేంద్రరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన దేవస్థానం డీసీ



**కోడూరు, మేజర్ న్యూస్ :** అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదును బుధవారం ఉదయం మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు కలిశారు. ఇటీవల దేవస్థానం డీసీగా, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓగా బాధ్యతలు చేపట్టిన వరప్రసాదరావు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ లను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

## గర్భిణీలు ఆరోగ్య సూత్రాలను పాటించాలి




చల్లపల్లి సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ : తల్లీ.. బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి గర్భిణీ ఆరోగ్య సూత్రాలను పాటించాలని లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు సూచించారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం సచివాలయం – 2 లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంతోపాటు గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లూరు కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ విశ్రాంతమ్మ, ఆదిలక్ష్మి, కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. పోషకాహారంతో తయారుచేసిన వంటకాలను అంగన్వాడీ కార్యకర్తలు ప్రదర్శించారు. బాలింతలు, గర్భిణీలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తల గురించి సూపర్వైజర్లు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి ఆశీస్సులు అందించారు.

# జర్నలిస్టుల హెల్త్ కార్డు పరిమితిని 2 నుంచి 10 లక్షలకు పెంచండి

### రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఏ.పి.ఏం.పి. ఏ.వినతి

**విజయవాడ, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** జర్నలిస్టుల హెల్త్ కార్డు పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచవలసిందిగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏ.పి.ఏం.పి.ఏ.) ఆధ్వర్యంలో పలు జర్నలిస్ట్ సంఘాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను కోరింది. అదేవిధంగా హెల్త్ కార్డ్ సాఫ్ట్ వేర్ లో వస్తున్న సాంకేతిక సమస్యల వల్ల ప్రభుత్వం జీవో ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ అనేకమంది జర్నలిస్టులు హెల్త్ కార్డుల సమస్యను ఎదుర్కొంటున్నారని ఏ.పీ.ఎం.పీ.ఏ.రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పాస్వర్డ్ మీకు ఇస్తాము, మీరే అప్లోడ్ చేసుకోమని అధికారులు చెప్పడం వల్ల గ్రామీణ ప్రాంత జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పలు కార్పొరేట్ హాస్పిటల్ లలో ఆరోగ్యశ్రీ కార్డులే కాక జర్నలిస్టుల హెల్త్ కార్డులను కూడా గుర్తించట్లేదని, తద్వారా ఎమర్జెన్సీ సర్వీస్ అవసరమైన జర్నలిస్టు మిత్రులు ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతుందని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత పది సంవత్సరాలు క్రితం ప్రభుత్వమే హెల్త్ కార్డుల ప్రాసెస్ పూర్తి చేసి, హెల్త్ కార్డులను స్వయంగా జర్నలిస్టులకు అంద చేసిందన్నారు. అదేవిధంగా, జర్నలిస్టు హెల్త్ కార్డు అప్లోడ్ లో సాంకేతికంగా వస్తున్న సమస్యలను పరిష్కరించి రాష్ట్ర ప్రభుత్వమే జర్నలిస్టుల హెల్త్ కార్డులను స్వయంగా అందించాలని జర్నలిస్ట్ నాయకులు మంత్రి కోరారు. జర్నలిస్ట్ నాయకుల



విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన వైద్య మంత్రి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి తో ఫోన్ లో మాట్లాడి జర్నలిస్ట్ హెల్త్ కార్డు పరిమితి రెండు లక్షల నుంచి పది లక్షలకు పెంచే విషయంలో కలసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్దామని మంత్రి కోరారు. అదేవిధంగా హెల్త్ కార్డు అప్లోడ్ లో వస్తున్న సాంకేతిక సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి జర్నలిస్ట్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చిన్న పత్రికల సంపాదకుల సంఘ అధ్యక్షులు కూర్మ ప్రసాద్ బాబు, రాష్ట్ర నాయకులు కే నమ్మయ్య, విజయవాడ జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏవివి శ్రీనివాస్ రావు, ఏ.పీ.ఎం.పీ.ఏ. నాయకులు ఆర్. కోటేశ్వరరావు,నాగోతి శ్రీనివాస్ రావు,హేమంత్ ప్రకాష్ తదితర జర్నలిస్ట్ నాయకులు పాల్గొన్నారు.

# అధికారుల సమన్వయ లోపమా... నిర్లక్ష్యమా..?

**కలెక్టర్ పర్యటనలో భద్రతా చర్యలు శూన్యం**

**ఒక సాధారణ పడవలో కలెక్టర్ ప్రయాణం**

**కలెక్టర్ ధైర్యసహసాలకు ఫిదా అయినా మండల ప్రజలు**



కృత్తివెన్ను సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్. కృత్తివెన్ను మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటన ఒక దశలో ఉత్కంఠ బరితంగా కొనసాగింది. బుధవారం ఆక్వా సాగు పరిస్థితులను పరిశీలించడానికి కలెక్టర్ డీకే బాలాజీ కృత్తివెన్ను మండలానికి విచ్చేశారు. కలెక్టర్ పర్యటన అంటేనే అధికారులలో భయం ఉంటుంది. అయితే ఇక్కడ అంతా ప్రత్యేకంగా కనిపించింది గరిసిపూడి పంచాయతీ అండర్ తన్నేల్ వద్ద ఉప్పుటేరులో తొట్టె లో పండుగప్ప చేప పెంపకాన్ని పరిశీలించేందుకు బోటులో ప్రయాణించాల్సిన పరిస్థితి వచ్చింది. బోటులో ప్రయాణించేందుకు ఎవరి దగ్గర లైవ్ జాకెట్స్ లేకపోవడం ఆశ్చర్యం అనిపించింది. కలెక్టర్ తన వెంట తెచ్చుకున్న జాకెట్ ధరించి బోటులో సుమారు 20 నిమిషాల పాటు ప్రయాణం చేసి పండుగప్ప చేపల పెంపకాన్ని పరిశీలించారు. కలెక్టర్ పర్యటన షెడ్యూల్ తెలిసిన మత్స్య శాఖ అధికారులు కనీసం నిబంధనలు పాటించకుండా సమన్వయ లోపంతో వ్యవహరించినట్లు కనిపిస్తుంది. రిస్క్ ప్రయాణం చేసేటప్పుడు కనీసం లైవ్ జాకెట్ తప్పనిసరిగా ధరించాల్సి ఉంటుంది. అధికారులు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించారేమో అనే సందేహం మండల ప్రజల నుంచి వ్యక్తమౌతుంది. ఏదేమైనప్పటికీ కలెక్టర్ ధైర్య సాహసాలతో బోటు పైన ఉప్పుటేరులో ప్రయాణం చేసిన తీరు అందరినీ అబ్బుర పరచడమే కాకుండా మండల ప్రజలను ఫిదా చేసింది.

# ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### రైతులు సొసైటీలుగా ఏర్పాటు అయితే ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందవచ్చు : కలెక్టర్ డీకే బాలాజీ







**కృత్తివెన్ను, సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** ఆక్వా రైతులు సొసైటీలుగా ఏర్పాటయి ప్రభుత్వ పరమైన అన్ని ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆక్వా రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామంలో సాయి హర్షిత్ ఆక్వా టెక్ కంపెనీ సందర్శించి రొయ్య, పండుచేప విత్తనం తయారీ పరిశీలించారు. లార్వా దశ నుంచి పోస్ట్ లార్వా తదితర దశల్లో సీడ్ పెరుగుదల, తయారీకి వినియోగించే ఫీడ్, మందులు తదితర వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చినగొల్లపాలెం సర్పంచ్ గ్రామస్తులు మత్స్యకారులు కలెక్టర్ ను కలిసి తమ సమస్యలు వివరించారు. సముద్ర మొగ పూడిక వల్ల మత్స్యకారుల జీవన ఆదాయం తగ్గిపోయిందని, మొగ పూడిక తీయించాలని, ఉప్పుటేరు కొత్త కాలువ స్ట్రెట్ కట్ డ్రెడ్జింగ్ చేసి పూడిక తీయించాలని, చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు జీవనభృతి మంజూరు చేయాలని, మత్స్యకారులకు వలలు ఐస్ బాక్సులు, ఏరియేటర్లు మంజూరు చేయాలని, లక్ష్మీపురం పిహెచ్సిసి దూరంగా ఉందని, దీవులలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. వికసిత్ ఆంధ్ర విజన్ డాక్యుమెంట్లో డ్రెడ్జింగ్ పనుల ప్రతిపాదనలు చేసినట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులకు జీవన భృతి త్వరలో విడుదల చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు ద్వారా వలలు, ఐస్ బాక్సులు, ఏరియేటర్స్ అందించుటకు చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఆక్వా సాగుకు విద్యుత్ సబ్సిడీ అందించి పరిశ్రమను ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఆక్వా రంగంలో విద్యుత్ సబ్సిడీ అందించుటకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ గరిసపూడి వద్ద వెనామి రొయ్యల చెరువు సాగు పరిశీలించారు. అనంతరం గరిసపూడి అండర్ టన్నెల్ వద్ద పండుగప్ప చేప కేజ్ కల్చర్ పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా మత్స్యశాఖ జేడి ఏ చంద్రశేఖర్, ఏడి నాగబాబు తాసిల్దారు కే జిఎన్‌సోమేశ్వరరావు ఎంపీడీవో మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా

## మెట్ల మార్గాలను పరిశీలించిన సీపీ



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పుర స్కరించుకొని భక్తులు అందరూ ఆనందోత్సవాలతో శాంతి భద్రతల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో అమ్మవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేస్తున్న భద్రతా ఏర్పాట్లను బుధవారం ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు సలహాలు అందించారు. ఈ నేపధ్యంలో నగర పోలీస్ కమీషనర్, తూర్పు జోన్ డి.సి.పి. గౌతమి షాలి, టెంపుల్ అధికారులతో కలిసి మల్లేశ్వర స్వామి టెంపుల్ మెట్ల మార్గం, కనకదుర్గనగర్, మల్లిఖార్జున పేట పరిసర ప్రాంతలను పరిశీలించి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి కలుగకుండా ఉండేందుకు తగు సూచనలు, సలహాలను అధికారులకు అందించారు. అదేవిధంగా క్యూలైన్లను, దర్శనం అనంతరం భక్తులు వెళ్ళు మార్గాలను పరిశీలించి, ఎక్కడా ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు, దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హతున్న ప్రతి కుటుంబానికీ ఆర్థిక సహాయం

### 26వ తేదీ సాయంత్రంలోగా పెండింగ్ అర్జీల పరిష్కారం

**జిల్లా కలెక్టర్ డా. జి.సృజన**



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందుతుందని.. ఈ నెల 22, 23వ తేదీల్లో వచ్చిన 13వేల అర్జీలను కూడా గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా క్షుణ్నంగా పరిశీలించి.. ఈ నెల 26వ తేదీ సాయంత్రంనాటికి పరిష్కరించి, నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. ముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు జరిగిన నష్టాన్ని 1500 బృందాలతో అంచనా వేయడం జరిగిందని.. ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనముతో జరిగిందన్నారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరక్కూడదనే ఉద్దేశంతో జిల్లాస్థాయి అధికారులతో రీ వెరిఫికేషన్ ప్రక్రియను కూడా నిర్వహించడం జరిగిందన్నారు. పలు అవకాశాలు ఇచ్చి బాధితులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు రూపొందించి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం బుధవారం సాయాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాలకు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే ఇంకా ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఆది, సోమవారం రెండు రోజుల పాటు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేయడం జరిగిందని.. ఈ విధంగా వచ్చిన 13 వేల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బుధవారం క్షేత్రస్థాయిలో ఏడువేల దరఖాస్తుల పరిశీలన జరిగిందని.. మిగిలిన ఆరువేల అర్జీలను పరిశీలించే ప్రక్రియను గురువారం సాయంత్రం నాటికి పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి తప్పనిసరిగా సాయమందించడం జరుగుతుందని.. రానివారికి ఎందుకు రాలేదో చెబుతూ సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ సృజన వివరించారు.

## ఎస్ ఎన్ గొల్లపాలెంలో సామూహిక శ్రీమంతాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎస్ఎన్ గొల్లపాలెంలో బుధవారం సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. గత 25 రోజులుగా జరుగుతున్న పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బందరు సెక్టార్ సూపర్వైజర్ విజయ కుమారి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పసిపిల్లలకు పౌష్టికాహారం ఎంతో విలువైనదని చెప్పారు. పిల్లల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా తెలియజేశారు. గ్రామ ప్రముఖులు కొండేటి సుబ్రహ్మణ్యం కొనకళ్ళ మధు కొల్లూరి సురేష్ తలారి రవి గణేష్ సౌజన్యంతో గర్భిణీలకు చీరలను అందజేశారు. అలాగే వెల్ బేబీషో నిర్వహించారు ఈ షోకి ఎస్ ఎన్ గొల్లపాలెం ఎమ్మెస్‌కె అనుపమ బహుమతులను అందజేశారు. సూపర్వైజర్లు జి మాలతి వెంకటేశ్వరమ్మ సెక్టార్‌లోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆర్ఆర్ఆర్ విజ్ఞాన కేంద్రం ద్వారా అవగాహన

## స్వచ్ఛత హి సేవలో రెడ్యూస్ రియూస్ రీసైకిల్ పై విస్తృతమైన కార్యక్రమాలు





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వచ్ఛతాహి సేవ అంటూ సెప్టెంబర్ 17 నుండి మొదలైన స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా, రెడ్యూస్ రీసైకిల్ పై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు విజయవాడ నగర పాలక సంస్థ. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ఉదయం స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఆర్ఆర్ఆర్ విజ్ఞాన కేంద్రంలో విద్యార్థి వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బంది. అందులో భాగంగా ఎం.కే బేగ్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు అజిత్ సింగ్ నగర్ ఎక్స్ఎల్ ప్లాంట్‌లో గల ఆర్ఆర్ఆర్ విజ్ఞాన కేంద్రంలో రెడ్యూస్ రీసైకిల్ మీద అవగాహన కల్పించారు. అందులో భాగంగా వ్యర్థ పదార్థాల నిర్వాహన గురించి ఆ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడమే కాకుండా మనం రోజు వాడే వస్తువుల్లో రెడ్యూస్ రీ యూస్ రీసైకిల్ అనే అంశంని ఎలా పాటించాలి అన్న దాని గురించి వాళ్ళకి అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు అంతేకాకుండా విజ్ఞాన కేంద్రంలో ఉన్న రెడ్యూస్ రీసైకిల్ పద్ధతిని ఎలా జరుగుతుంది ఏంటి విజయవాడ నగరంలో ఉన్న ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ విషయాల పైన విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సెల్ ప్లాంట్ లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్, విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్ ప్లాంట్ల, మినీ సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్ యూనిట్, మాట్రేస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి అండ్ డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్ ద్వారా వచ్చే రీసైకిల్డ్ వస్తువులను విద్యార్థినీ విద్యార్థులకు చూపించి, వారు కూడా రెడ్యూస్, రీ యూస్, రీసైకిల్ ద్వారా వచ్చే వస్తువులనే వాడాలని అవగాహన కల్పించారు.

# సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయలేదు





## కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం 100రోజులు పాలనలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లు కృష్ణ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశానుసారం బుధవారం కృష్ణా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో థాళీ బజావో నినాదంతో నిద్రపోతున్న ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన తెలుగుదేశం ప్రభుత్వాన్ని మేలుకొలిపే విధంగా ప్లేట్లు గంటెలతో శబ్దం చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యేలా పెద్ద ఎత్తున నినాదాలతో కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గొల్లు కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని వంద రోజుల పరిపాలనలో భాగంగా ఎన్నికల హామీలు ముందుగా చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను దొంగలు తొక్కారని వాటిలో ప్రధానంగా తల్లికి వందనం పేరుతో స్కూలు విద్యార్థులకు ఇస్తానన్న 15000 రూపాయల పథకం ఊసే లేదు అని, కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తానన్న పథకం ధ్యాసే లేదని నిరుద్యోగులకు హామీ ఇచ్చిన ఉపాధి కల్పించడం లేదని నిరుద్యోగ భృతి కూడా లేదని, ఏదిఏమైనా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీలు ఇవ్వటమే కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడానికి కనీసం ప్రయత్నం కూడా చేయటం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షేమని కాంగ్రెస్ పార్టీ ఉంటేనే ప్రజలందరికీ క్షేమమని వివరించారు.. ఇక ముందు కాలంలో కూడా రాష్ట్ర ప్రజల్ని విస్మరిస్తే అధ్యక్షురాలు షర్మిలమ్మ నాయకత్వంలో ఇలాంటి నిరసన కార్యక్రమంలో ప్రజల పక్షాన నిలిచేందుకు మరెన్నో చేపడతామని వెంటనే ఈ పథకాల అమలు ప్రక్రియ మొదలు పెట్టాలని గొల్లు కృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లు కృష్ణతో పాటు, మచిలీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతిన్, పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలిసెల సుబ్రహ్మణ్యం, పెడన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి నాగరాజు, పిసిసి డెలిగేట్ సభ్యులు కోకా ఫణిభూషణ్,కొడమంచిలి చంద్రశేఖర్,నల్లబ్రోలు శామ్యూల్, మట్ట దత్తుడు, చిలుకోటి ప్రసాద్ తోపాటు మరికొంతమంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు సినీ సంగీతాన్ని సుసంపన్నం చేసిన ఎస్.పీ బాలసుబ్రహ్మణ్యం



**కోడూరు, మేజర్ న్యూస్ :** తెలుగు సినీ సంగీతాన్ని ఎస్.పీ బాలసుబ్రహ్మణ్యం సుసంపన్నం చేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డలో తన కార్యాలయంలో బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకొని బాలు చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ ఘననివాళి అర్పించారు. తెలుగు సినీ ప్రేక్షకులకు మరువలేని, మరపురాని పాటలు అందించారన్నారు. నియోజకవర్గ నాయకులు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రామ్, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మెగావత్ గోపీ, టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఘంటసాల రాజమోహనరావు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు తాడికొండ చిన్నా, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకిరాంబాబు, కూటమి నాయకులు కొల్లూరి వాసు, మండలి రామ్మోహనరావు, యలవర్తి చిన్నా, లింగం బాబూరావు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, యలవర్తి ఆది, బచ్చు శ్రీహరి, జల్లూరి ప్రసాద్, బాదర్ల లోలాక్షు నాయుడు, దాసినేని శ్రీను, దామెర్ల సతీష్, రేపల్లె అంకినీడు, యడ్లపల్లి లక్ష్మణరావు (బుజ్జి), శోభిల ఏడుకొండలు, మునిపల్లి బుజ్జి పాల్గొన్నారు.



## జనసేన పార్టీ ఆధ్వర్యంలో తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో ప్రాయశ్చిత్త దీక్ష

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బాడిశ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం లో పవిత్రమైన శ్రీవారి లడ్డు లో జంతువుల కొవ్వు నుంచి తీసిన నూనె నెయ్యి లో కలిపి కల్తీ నెయ్యి ని లడ్డు ప్రసాదం లో కలిసి అపవిత్రం జరిగినందున జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పదకొండు రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. దానికి సంఘీభావంగా ఈ రోజు నియోజకవర్గంలో తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని శుద్ధిచేసి ఆలయ మెట్లను పసుపు కుంకుమలతో అలంకరించి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టడం జరిగిందని ప్రపంచ వ్యాప్తంగా ఉన్నటువంటి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన జగన్ మోహన్ రెడ్డి చేసిన పాపాల వలనే రాజకియం గా భవిష్యత్తు లేకుండా పోయిందని మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ముత్యాల వెంకట శ్రీనివాసరావు, వత్సవాయి మండల అధ్యక్షులు రేగండ్ల వెంకట రామయ్య, కార్యదర్శి బంక బాలు, ప్రభాస్, చిట్టిబాబు, రోషన్, సైదులు వంశీ చంటి బాను వెంకట సాయి గోపి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కొనకళ్లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, దేశం నాయకులు



**పామర్రు సెప్టెంబర్ 25 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావును రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీ నూతన చైర్మన్‌గా నియమించిన సందర్భంగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మచిలీపట్నంలోని కొనకళ్ళ కార్యాలయంలో నారాయణరావు, ఆయన సోదరుడు బుల్లయ్యలను కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా మచిలీపట్నం పార్లమెంటు నియోజవర్గ పరిధిలో ఆయన అందించిన సేవలు మరువలేనివని ఈ సందర్భంగా కుమార్ రాజా పేర్కొన్నారు. అలాగే ఎన్నికల సమయంలో పార్టీ అధ్యక్షునిగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఆయన కృషి చేశారని అన్నారు. ఆర్టీసీ నూతన చైర్మన్‌గా ఆ సంస్థను బలోపేతం చేసి సమర్థవంతంగా నిర్వహిస్తారనే ఆశాభావాన్ని ఎమ్మెల్యే కుమార్ రాజా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి లక్ష్మీదాసు, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, మండపాక శంకర్ బాబు, వల్లూరిపల్లి గణేష్ కుమార్, జక్కా శ్రీనివాసరావు, చాట్ల రమేష్, జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

సూర్య దినపత్రిక నందు

కంచికచర్ల, చందర్లపాడు,

ఇబ్రహీంపట్నం, వీరులపాడు మండలాల్లో

పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999